క్లుప్తంగా

లోకేశ్ పాదయాత్రకు స్పందన కరువు


బుడితి సుమన్

నరసాపురం: జిల్లాల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు మాజీ మంత్రి నారా లోకేశ్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజా స్పందన కరువైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు బుడితి సుమన్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాదయాత్రకు స్పందన కరువవడంతో దిక్కుతోచని లోకేశ్, టీడీపీ నాయకులు పాదయాత్ర ముసుగులో అల్లర్లు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకుల పాశవికంగా దాడులకు తెగబడటం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, సంక్షేమ పథకాల అమలుకు పూర్తి మద్దతు ఇస్తున్నారని వివరించారు. జగన్ పాలనపై పూర్తి సంతోషంగా ఉన్న ప్రజలు లోకేశ్ పాదయాత్రను అస్సలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ నాయకుడిపై ఎన్ని ఎక్కువ కేసులుంటే అంతమంచి నామినేటెడ్ పదవి ఇస్తామని స్వయంగా లోకేశ్ చెప్పడం టీడీపీ ఫ్రస్టేషన్‌కు నిదర్శనమని వివరించారు.

గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకలు


నారినమెరకలోని గీతామందిరం వద్ద యువత సందడి

యలమంచిలి: నారినమెరక గ్రామంలోని ఆనందవనంలో ఉన్న గీతామందిరంలో గురువారం కృష్ణాష్టమి సందర్భంగా విశిష్టంగా పూజలు నిర్వహించారు. గీతామందిరంలోని మురళీకృష్ణ విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. ఆలయ నిర్మాత తమ్మినీడి అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో వేద పండితులు శ్రీనివాసుల విజయ గోపాలచార్యులు, వాడపల్లి లక్ష్మీనారాయణ బ్రహ్మత్వంలో ఉదయం స్వామికి అభిషేకం, అర్చనలు, పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారి ఉత్సవ విగ్రహానికి మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం చేశారు. రాత్రి ఆలయం వద్ద ఉట్టి కొట్టారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో నెల రోజుల సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. గురుకుల్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలను రోటరీ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ రోజు స్కిప్పింగ్ ఆడటం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. ఈ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బహుమతులు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మద్దాల వాసు, చందక రాము, కఠారి నాగేంద్రకుమార్, కానూరి ప్రభాకరరావు, పోతాబత్తుల సత్యనారాయణ, గురుకుల్ పాఠశాల ప్రిన్సిపాల్ గణేశ్వర మహాపాత్ర పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తా


భీమవరంలో మోషేనురాజుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో ప్రకాశం పంతులు విగ్రహం నెలకొల్పడానికి తన వంతు కృషిచేస్తానని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. గురువారం ప్రకాశం పంతులు విగ్రహ ఏర్పాటు కమిటీ మోషేన్‌రాజును కలసి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. కులమత, రాజకీయాలకు అతీతంగా విగ్రహం ఏర్పాటుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నందున సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, నందమూరి రాజేష్ తదితరులు వినతిపత్రం అందించారు.

స్వర్ణ క్లబ్ సేవలు అభినందనీయం

తణుకు టౌన్: స్వర్ణ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని స్వర్ణ క్లబ్ అధ్యక్షురాలు చిట్టూరి సుజాత ఆధ్వర్యంలో పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు గురువారం సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని సత్కరించారు. అనంతరం సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. సుంకవల్లి చిరంజీవిని కుమారి, డి.రంగారావు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్

- నరసాపురం మున్సిపల్ కార్యాలయానికి కొత్తరూపు
- పచ్చదనంతో మరింత సుందరంగా కార్యాలయం


ఆహ్లాదంగా తీర్చిదిద్దిన మున్సిపల్ కార్యాలయ ఆవరణ

నరసాపురం: ప్రభుత్వ కార్యాలయాలు.. వాటి ఆవరణలు, పరిసరాల పేరు చెబితే నిత్యం అక్కడికెళ్లే ప్రజలు ముక్కున వేలేసుకుంటారు. పచ్చదనానికి, పరిశుభ్రతకు దూరంగా ప్రభుత్వ కార్యాలయాలు ఉంటాయనేది ప్రజల్లో ఎప్పటి నుంచో ఉన్న ప్రచారం. అయితే నరసాపురం మున్సిపల్ కార్యాలయాన్ని చూస్తే అలాంటివారు తమ అభిప్రాయాలను మార్చుకోవాల్సి వస్తోంది. కార్యాలయం చుట్టూ పచ్చని మొక్కలు, కార్యాలయంలోకి అడుగుపెట్టే ముందు ద్వారానికి దగ్గరగా వాటర్ పౌంటేయిన్, అక్కడే మొక్కలతో స్వాగతం బోర్డు, లోపల కార్యాలయం ఆవరణలో గాంధీజీ విగ్రహం విగ్రహం చుట్టూ పచ్చని మొక్కలు, కార్యాలయం బయట ఆవరణలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఇలా కార్యాలయానికి వచ్చే వారికి కొత్త అనుభూతిని కలిగించే విధంగా తీర్చిదిద్దారు. కొన్ని రోజులుగా మున్సిపల్ వర్గాలతో పాటుగా పట్టణ వాసుల్లో కూడా మున్సిపల్ కార్యాలయం కొత్త అందాలపై చర్చ సాగుతోంది.

కమిషనర్ చొరవతో..

మున్సిపల్ కమిషనర్‌గా ఆరు నెలలు క్రితం బాధ్యతలు స్వీకరించిన కె.వెంకటేశ్వరరావు మొదటి నుంచి పాలనాపరంగా కొత్తపంథాలో ముందుకెళుతున్నారు. పట్టణంలో పలు కూడళ్లలో ఉండే జాతీయ నాయకుల విగ్రహాలను నెలలో ఓ రోజు శుభ్రం చేయాలని, అలాగే మున్సిపల్ వాహనాలను వారంలో ఓ రోజు శుభ్రం చేయాలని, ఇక ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కొత్త ఆలోచనలతో ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు సొంత కార్యాలయం ఆవరణ ఆహ్లాదంగా ఉండాలని, పరిశుభ్రంగా ఉండలనే ఉద్దేశంతో చొరవ చూపించి మున్సిపల్ కార్యాలయానికి ఈ కొత్తరూపు తీసుకొచ్చారు. అధికారులు బాధ్యతలతో పాటుగా ఈ తరహా అంశాలపై కూడా దృష్టి పెడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణగా నిలుస్తుంది.


కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్



పచ్చని మొక్కలతో ఏర్పాటు చేసిన వెల్‌కమ్ బోర్డు


ప్రహరీ పాదవునా ఉన్న మొక్కలు

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుగొండ: ఆచంట ప్రభుత్వ ఐటీలో 2023-24 విద్యా సంవత్సరంలో చేరేందుకు నాల్గవ విడత కౌన్సెలింగ్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ యిండుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు ఆచంట కాలేజీలో దరఖాస్తులు, ధ్రువపత్రాల నకళ్లను స్వయంగా కళాశాలలో అందించాలన్నారు. అనంతరం 22వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకొని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మిగిలిన వివరాల కోసం 94901 11002కు ఫోన్ చేయాలని కోరారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పోడూరు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి పీతల రాజమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, ఉద్యోగులకు వయస్సుతో నిమిత్తం లేకుండా పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతీనెలా 1నే జీతాలు ఇవ్వాలనీ, పదవీవిరమణ ప్రయోజనాలు కల్పించాలని కోరారు.

మాజీ ఎంపీపీ కందులకు సతీవియోగం

కాళ్ల: మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కందుల వెంకట మల్లికార్జునరావు భార్య బొండాడ మాజీ సర్పంచ్ నాగమణి (59) గురువారం స్వర్గస్తులయ్యారు. ఇటీవల కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బొండాడలోని ఇంటి వద్ద గురువారం మృతి చెందారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విచ్చేసి ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, గాదిరాజు సుబ్బరాజు, తోట ఫణిబాబు, మన్నే నాగరాజు తదితరులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పోడూరు: మండలంలోని కొమ్ముచిక్కాల శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్ముచిక్కాల, కాపవరం, వాలమర్రు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

13న ఐటీఐలో జాబ్‌మేళా

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐటీఐలో ఫిట్టర్ ట్రేడ్ పాస్ అయిన అభ్యర్థులు జాబ్ మేళాలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలకు ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు.

టెన్త్ అర్హతతో వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగం

ప్రభుత్వ ఐటీఐతో లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్ వారితో జరిగిన ఒప్పందం మేరకు 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల స్త్రీ, పురుషులకు స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి వేర్‌హౌస్ అసోసియేట్‌గా ఉద్యోగం కల్పిస్తామని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా ఐటీఐలో సంప్రదించాలన్నారు. ఉద్యోగం పొందిన వారికి వారానికి ఐదు రోజులు మాత్రమే పని ఉంటుందన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ చెక్కును అందిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు


బీచ్‌లో విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి

మొగల్తూరు: మహిళా సాధికారితే లక్ష్యంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం మొగల్తూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాలుగో విడత సున్నా వడ్డీ చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1833 గ్రూపులకు గాను రూ.2.83 కోట్లు సున్నా వడ్డీ పథకంలో అందించామని వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు సంవత్సరాల కాలంలో 1527 గ్రూపులకు గాను బ్యాంక్ లింకేజ్ రుణాలు ద్వారా రూ.45.42 కోట్లు జమ చేశామని వివరించారు. వైఎస్సార్ ఆసరా ద్వారా మూడు విడతల్లో 1566 గ్రూపులకు రూ.51.42 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా 1856 గ్రూపులకు గాను రూ.13.80 కోట్లు, జగనన్న తోడు పథకంలో 3857 మంది లబ్ధిదారులకు రూ.3.85 కోట్లు, జగనన్న చేయూత ద్వారా 3 విడతలలో 3581 మంది లబ్ధిదారులకు రూ.18.99 కోట్లు వారివారి ఖాతాలో జమ చేశామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, నాయకులు ఆండ్రాజు చల్లారావు, కర్రి ఏసుబాబు, మోటుపల్లి రాంభాస్కరరావు, పాలా రాంబాబు, దూసనపూడి దొరబాబు పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణ పనులు వేగంగా చేయాలి

మొగల్తూరు: బీచ్‌లో ఏర్పాటు చేయనున్న దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. బీచ్‌లో 20 అడుగుల కాంస్య విగ్రహంతో పాటు మ్యూజియం నిర్మాణానికి రూ.కోటి మంజూరు కావడంతో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో బీచ్ ఫెస్టివల్ సందర్భంగా కెపిపాలెం, పేరుపాలెం బీచ్‌లను వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌లుగా నామకరణం చేశామని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే పర్యాకంగా బీచ్‌లను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బీచ్‌ల అభివృద్ధి విషయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో 20 అడుగుల కాంస్య విగ్రహంతో పాటు రాజశేఖరరెడ్డి జీవిత విశేషాలన తెలిపేలా మ్యూజియం, విగ్రహం చూట్టూ సందర్శకులు కూర్చునేలా పచ్చని లాన్ ఏర్పాటుకు రూ.కోటి మంజూరు చేశారని వివరించారు. బీచ్‌కు వచ్చే సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆయన వెంట నాయకులు కర్రి ఏసుబాబు, పోతుల రమేష కారుమించి కృపాల్, పత్తి రాంబాబు, శంకరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

4వ విడత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఉండి: జిల్లాలోని 2 ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను నాలుగో విడత ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ (ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట)లలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పరిశీలన చేయించుకోవాలని సూచించారు. అడ్మిషన్‌ల కొరకు ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో లేదా 08816 297093 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

90 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో 90 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసినట్లు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెప్పారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం, తుందుర్రు, పెదగరువు తదితర గ్రామాలలో సుమారు 7 వేల ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారన్నారు. 90 శాతం ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. మిగిలిన 10 శాతం రైతులు త్వరితగతిన ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల పభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆర్‌బీకే సెంటర్లలో బుక్ చేసుకుంటే 48 గంటల్లో అందజేస్తామని వివరించారు.

పండుగలు ఐక్యతను చాటుతాయి


ములపర్రులో కోలాట భజన బృందానికి బహుమతి అందిస్తున్న దృశ్యం

పెనుగొండ: పండుగలు గ్రామాల్లో ఐక్యతను చాటి చెబుతాయని పెనుగొండ ఎఎంసీ చైర్మన్ వెలగల వెంకట రమణ(మిస్సీ) అన్నారు. కృష్ణాష్టమి ఉత్సవాలు సందర్భంగా ములపర్రు కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం, ఉట్టికొట్టుడు కార్యక్రమాల్లో విజేతలకు గురువారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడాలంటూ శ్రీకృష్ణుడు ఉపదేశించిన మార్గాన్ని ప్రతీ ఒక్కరూ ఆచరించాలని కోరారు. కృష్ణాష్టమి వేడుకలు పెనుగొండ మండలంలో పెనుగొండ, వడలి, సిద్ధాంతంల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), రాష్ట్ర ఉమెన్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరక్టరు బొక్కా అరుణ, సంస్థ అధ్యక్షుడు బొక్కా రమణ, సమరసత సేవా సమితి కన్వీనర్ చింతాకుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్‌లు అందజేత


పెనుమంట్రలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రియాంక

పెనుమంట్ర: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అన్నారు. కొత్తగా మంజూరైన 20 పింఛన్‌లను గురువారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు. మరో 24 మందికి ఫేజ్-2లో పింఛన్లు మంజూరు కానున్నాయని ఆమె చెప్పారు. గత నెల వరకూ ప్రతీ నెలా 1035 మందికి రూ.27.59 లక్షలు పంపిణీ చేశామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యురాలు చింతపల్లి మంగాదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్లు దొంగబేబి, నరసింహమూర్తి, తాడపర్తి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యమండల ఆకృతిలో పెరటి తోటల సాగు


సూర్యమండల ఆకృతిలో పెరటి తోటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యలమంచిలి: సూర్యమండల ఆకృతిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పెరటి తోటలను సాగు చేయడం వలన ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండిచవచ్చని సేంద్రీయ వ్యవసాయ శాఖ పాలకొల్లు డివిజన్ ఇన్‌చార్జి పి.అప్పారావు చెప్పారు. కాంబొట్లపాలెంలో గురువారం పార్శి సత్యనారాయణ తోటలో సూర్యమండల ఆకృతిలో వివిధ జాతుల పంటలు ఏ విధంగా పండించాలో? ఆయన వివరించారు. ముందుగా సూర్యమండల ఆకృతిలో భూమిని దున్నించి, దున్నిన భూమిని ఏడు భాగాలు చేశారు. ఒక్కో భాగంలో దుంప జాతికి చెందిన కారెట్, పసుపు, ముల్లంగి, ఆకు జాతికి చెందిన తోటకూర, గోంగూర, మెంతుకూర కాయ కూరల జాతికి చెందిన వంకాయ, టమోట, బెండ, మిర్చి తీగ జాతికి చెందిన ఆనప, కాకర, బీర, దోస పెద్ద పండ్ల జాతికి చెందిన మామిడి, పనస చిన్న పండ్ల జాతికి చెందిన బొప్పాయి, మునగ బోర్డర్ క్రాపుగా బంతి, మొక్కజొన్న, ఆముదం మొక్కలు ఎలా పెంచాలో వివరించారు. ఈ విధంగా మొక్కలు వేసి ద్రవ, ఘన జీవామృతాలు, కషాయాలతో సాగు చేయడం వల్ల ఎలాంటి పురుగుమందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని అప్పారావు తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న డ్వాక్రా మహిళలంతా తమ ఇంటి పెరటిలో పురుగు మందులు చల్లకుండా ప్రకృతి సిద్ధమైన కషామాలు, కల్చర్ జీవామృతం పిచికారీ చేసి కాయకూరలు పండించుకుని వాటిని తిని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.జ్యోతి, జడ్డు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీదుర్గ, కంకటాల శాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


వడలిలో పొలంబడిలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి స్పందన

పెనుగొండ: వరి పంటను ఆకు ఎండు తెగులు, మాగుడు తెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు స్పందించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.స్పందన సూచించారు. గురువారం వడలిలో పొలంబడి నిర్వహించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. యాజమాన్య పద్ధతులు రైతులు విధిగా పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి రైతులకు అండగా నిలవడానికే ప్రభుత్వ ఆదేశాల మేరకు పొలంబడి నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులు పొలం బడిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్ నమోదుకు రైతులు పంట రకాలను ఆర్‌బీకే కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్ ఆవశ్యకతపై ఎస్పీ అవగాహన


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

ఆకివీడు: వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకు ముప్పు తప్పదని ఎస్పీ యు.రవిప్రకాష్ వాహనచోదకులను హెచ్చరించారు. స్థానిక ఐ.భీమవరం రోడ్డులో హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన చోదకులను నిలిపి హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. అతి వేగంగా వాహనాలు నడపడం ప్రాణాలకు ముప్పు అని, హెల్మెట్ లేకపోవడం మరింత ప్రమాదకరమని ఎస్పీ పేర్కొన్నారు. ఐ.భీమవరం రోడ్డులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనపై ఎస్పీ ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు, మరణాలు తగ్గే విధంగా పలు చర్యలు చేపట్టాలని సీఐ, ఎస్సైలకు సూచించారు.

ఆక్వా రైతులను ఆదుకుంది జగన్ ప్రభుత్వమే

- క్షత్రియులకు అత్యధిక గుర్తింపునిచ్చింది సీఎం వైఎస్ జగనే
- జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు


దుర్గాప్రసాద్ రాజు

కాళ్ల: ఆక్వా రైతులను అన్ని విధాలా ఆదుకున్నది ఒక్క వైఎస్ జగన్ ప్రభుత్వమేనని జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గాప్రసాద్‌రాజు స్పష్టం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆక్వా రైతులకు అన్యాయం చేసినట్లు యువగళం పాదయాత్రలో ఆక్వా రైతుల సమావేశంలో లోకేశ్ మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా ఉండి ఎమ్మెల్యే ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలడంపై అసహనం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధితో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ, మేత రేట్లు, సీడ్ రేట్లు తగ్గించారన్నారు. పలు మార్లు రొయ్యల ధరలను ఎగుమతిదారుల సిండికేట్ తగ్గించిన సమయంలో కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి సబ్ కమిటీలు వేసి రైతులకు మేలు జరిగేలా చేశారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఆక్వా రైతులకు ఏ మేలు జరగలేదన్నారు. కానీ లోకేష్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పాలనలో క్షత్రియులకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ గత ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో క్షత్రియులకు ఒక సీటు, ఒక ఎంపీ సీట్లు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. అంతేకాకుండా టీడీపీ ఐదేళ్ల పాలనలో క్షత్రియులకు క్యాబినెట్ హోదా కూడా ఇవ్వలేదని ఘాటుగా విమర్శించారు. కానీ వైఎస్ జగన్ క్షత్రియులకు మూడు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు ఇచ్చి ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు మంత్రి పదవి ఇవ్వటంతో పాటు ముదునూరి ప్రసాదరాజుకు క్యాబినెట్ హోదా కలిగిన ప్రభుత్వ చీఫ్ విప్ పదవి ఇచ్చారన్నారు. అదేవిధంగా క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దివంగత నేత పాతపాటి సర్రాజుకు చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. ఆయన అనంతరం ఆయన తనయుడు శ్రీనివాసరాజుకు ప్రత్యేక స్థానం కల్పించి చైర్మన్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా డీసీసీబీ చైర్మన్ పదవి క్షత్రియులకు కేటాయించారన్నారు. పీవీఎల్ నరసింహారాజును డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగిస్తున్నారన్నారు క్షత్రియకు అత్యధిక గుర్తింపుని ఇచ్చింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒకరేనని అన్నారు. అలాగే గాదిరాజు వెంకట సుబ్బరాజుకు టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. లోకేష్, టీడీపీ నాయకులు సీఎం వైఎస్ జగన్‌పై ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరని, క్షత్రియులు వైఎస్ జగన్ వెంటే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.